

# ఎండ ప్రచండం

ఎండలో గొడుగు కింద నీళ్లు తాగుతున్న గొర్ల కాపరి



భానుడు మండుతున్నాడు. ఉదయం తొమ్మిది దాటితేనే భగ్గుమంటున్నాడు.. మధ్యాహ్నం వేళ తీవ్రరూపం దాల్చుతున్నాడు. రోజురోజుకూ ప్రతాపం చూపిస్తున్నాడు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీల దాకా నమోదవుతున్నాయి. తాజాగా శుక్రవారం అత్యధికంగా జగిత్యాల జిల్లాలో 41 డిగ్రీలు రికార్డయ్యాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం ఇండ్ల నుంచి బయటికి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. ఫ్యాన్లు, కూలర్లు నడిచినా ఉక్కబోతతో సతమతమయ్యారు.

- కరీంనగర్, ఫొటోగ్రాఫర్

# ద్రోహులకు ప్రజలే బుద్ధిచెబుతరు

- అవకాశవాదులు పోతే నష్టమేమీలేదు • కాంగ్రెస్‌లో కేశవరావు ఓ జోకర్ • కడియం శ్రీహరి, కావ్య నమ్మకద్రోహులు
- కాంగ్రెస్, బీజేపీకి అభ్యర్థులు కరువు
- అందుకే బీఆర్ఎస్ నుంచి తీసుకుంటున్నరు
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్
- వినోద్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకిస్తామని వెల్లడి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, మార్చి 29: బీఆర్ఎస్‌లో ఉండి పదేండ్లపాటు పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారే ద్రోహులకు ప్రజలే బుద్ధిచెబుతారని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హెచ్చరించారు. అవకాశవాదులు పార్టీని వీడినంత మాత్రాన జరిగే నష్టమేమీలేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. నికార్సయిన తెలంగాణవాదులు, ఉద్యమ నేతలే పార్టీకి శ్రీరామరక్ష అని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన మానకొండూర్ గడిమహల్‌లో విలేకరులతో మాట్లాడారు. జాతీయ పార్టీలని చెప్పుకునే బీజేపీ, కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువయ్యే బీఆర్ఎస్ నుంచి చేర్చుకుంటున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు జోకర్‌లా ఉన్న కేశవరావును కేసీఆర్ ఆదరించి ఉన్నత పదవులు కట్టబెట్టారని, ఆయన బిడ్డ విజయలక్ష్మిని గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌ను చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కేశవరావు కాంగ్రెస్‌లోకి వెళ్లి సాధించేదేమీ ఉండదని, మళ్లీ జోకర్‌లా మిగిలిపోవడం ఖాయమని ఎద్దేవా చేశారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఓడిపోయి ఇంట్లో కూర్చున్న కడియం శ్రీహరిని చేరదీసి కేసీఆర్ మంత్రిని చేశారని, హేమాహేమీలను కాదని ఆయన కూతురు కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చారని చెప్పారు. అలాంటి వారు స్వార్థం కోసం పార్టీ మారి నమ్మక ద్రోహులుగా మిగిలిపోయారని దుయ్యబట్టారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ద్రోహులకు తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. భవిష్యత్‌లో బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించి ఆరు గ్యారెంటీల అమలుపై పోరాటం చేస్తామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ప్రకటించారు. అందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, పోలాడి వంశీధర్‌రావు, నెల్లి శంకర్, ఇస్కుల్ల ఆంజనేయులు ఉన్నారు.



మొగ్దుంపూర్‌లో ట్యాంకర్ నీటితో వ్యవసాయ బావిని నింపుతున్న రైతు పూరెళ్ల అంజయ్య

# రైతన్న కన్నీటి గోస

- కరీంనగర్ రూరల్ మండలంలో ఎండుతున్న వరి
- ఎస్సారెస్పీ కాలువలు ఉన్నా చుక్కనీరు రాక అవస్థలు
- పంటలను కాపాడుకునేందుకు కర్షకుల అరిగోస
- ఆఖరి ప్రయత్నంగా ట్యాంకర్లతో నీటి సరఫరా
- ట్రిప్పునకు రూ.వెయ్యి చెల్లించి మరీ తడులు

**సాగునీటి కోసం తండ్లాట మొదలైంది. మొన్నటిదాకా పసిడిపంటలతో కళకళలాడిన కరీంనగర్ రూరల్ మండలం ఇప్పుడు కరువుఛాయలతో దర్శనమిస్తున్నది. ప్రధానంగా మొగ్దుంపూర్‌లో పరిస్థితి దారుణంగా ఉన్నది. ఈ గ్రామ పరిధిలో ఎస్సారెస్పీ కాలువలపై ఆధారపడి పంటలు సాగు చేసినా.. ఇప్పుడు చుక్కనీరు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికందే దశలో ఉన్న పంటలు ఎండుతుండగా, కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. చివరి ప్రయత్నంగా ట్యాంకర్లతో నీటిని పడుతున్నారు. ట్రిప్పనకు రూ. వెయ్యి చెల్లించి మరీ తడులు అందిస్తున్నారు. అయినా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించకపోవడంపై మండిపడుతున్నారు.**

కరీంనగర్ రూరల్, మార్చి 29: కరీంనగర్ రూరల్ మండలంలో సాగుకు ఎస్సారెస్పీ డీ86, డీ94 కెనాళ్లే ఆధారం. దాదాపు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఈ ఒక్క మండలమే కాదు చొప్పదండి, గంగాధర మండలాలకు ఈ కెనాళ్ల ద్వారానే నీరందుతుంది. కొన్నేళ్లుగా ఎస్సారెస్పీ నుంచి వారబందీ పద్ధతిన ఇచ్చే నీటితో ఎవుసం చేసుకున్నరు. పుట్లకొద్దీ ధాన్యం పండించారు. ఎప్పటిలాగే ఈ యాసంగిలోనూ నీళ్లస్తాయనే ఆశతో దండిగా పంటలు వేశారు. అయితే ప్రస్తుతం సాగునీరందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికందే దశలో ఉన్న పంటలు కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. డీ86, డీ94 కెనాళ్ల కింద మొగ్దుంపూర్‌లో 400 ఎకరాల్లో పంటలు వేయగా.. చుక్కనీరు రాక ఇప్పటికే 150 ఎకరాలు ఎండిపోయాయని ఆవేదన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. జేసీబీలు తెప్పించి కొత్తగా బావులు తవ్వుకున్నా, ఉన్న బావుల్లో క్రేన్ల సాయంతో పూడిక తీసినా ప్రయోజనం లేక నిరాశ చెందుతున్నారు. కొందరు ఇప్పటికే పంటలు వదిలేయగా, 15 మంది రైతులు మాత్రం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించుకుంటున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.వెయ్యి చొప్పున వెచ్చించి పదిహేను రోజులుగా తడులు అందిస్తున్నారు. ఒక్కో రైతు రోజుకు నాలుగు ట్రిప్పులు వాటర్ ట్యాంకర్లతో నీరు పోయిస్తున్నారు. అయినా పంటలు దక్కుతాయో..? లేదోనని భయపడుతున్నారు.



### నీళ్లు కొనే రోజస్తదని అనుకోలె

నాకు మొగ్దుంపూర్‌లో మూడెకరాల భూమి ఉన్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీళ్లతోనే ఎన్నోఏండ్ల సంది ఎవుసం చేస్తున్న. ఏనాడూ మాకు ఇబ్బంది కాలె. కానీ, ఈ యాసంగిల నరకం కనిపిస్తంది. అధికారులు నీళ్లు ఇస్తామని చెబితేనే ఎకరన్నర వరి పెట్టిన. కానీ ఏం లాభం? ఎస్సారెస్పీ నీళ్లు రాలే? ఇప్పటికే 20 గుంటల పొలం ఎండింది. బావిల కూడా నీళ్లు ఎల్లుతలేవు. చేతికి వచ్చిన పంటను చంపుకోబుద్ధి కాలె. ఉన్న ఎకరం పంటనైనా కాపాడుకోవాలని రోజుకు నాలుగు వాటర్ ట్యాంకర్లతో నీటిని పారించుకుంటున్న. ఒక్కో ట్రిప్పునకు రూ. వెయ్యి అయితంది. నీళ్లు కొనుక్కొని పంటలు పండిస్తనని ఎన్నడూ అనుకోలె.

- పూరెళ్ల అంజయ్య, రైతు (మొగ్దుంపూర్)

### ఎకరానికి ₹40వేల పరిహారమియ్యాలె

శ్రీరాంసాగర్ కాలువ నీరు ఇస్తమంటేనే నేను మూడెకరాలు కౌలుకు తీసుకొని పంట వేసిన. కౌలుకు ఎకరానికి ₹15వేలు



అయినయి. ఇంకా సాగుకు ₹20వేల దాకా పెట్టిన. కానీ ఏం పాయిదా..? బావిలో నీరులేదు. కాలువ నీరు వస్తలేదు. పంట ఆగమైంది. వారబందీల ఇచ్చే చివరి తడులతోనైనా పంట బతుకుతది అనుకుంటే చుక్కనీరు వస్తలేదు. వాటర్ ట్యాంకర్లతో నీటిని పారిస్తున్న. ఇసోంటి దినాన్ని చంద్రబాబు కాలంలో చూసినమంటే మళ్లీ ఇప్పుడే చూస్తున్న. మిగిలిన తడులైనా అందేటట్లు చూడాలె. లేదంటే ఎకరానికి ₹40వేల పరిహారం ఇయ్యాలె.

- బండారి రాములు, రైతు (మొగ్దుంపూర్)



రైతు నిరసన దీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

# అన్నదాత కోసం


## నేడు పెద్దపల్లిలో 36గంటల రైతు నిరసన దీక్ష

- కాంగ్రెస్ సర్కారు మొండి వైఖరిపై బీఆర్ఎస్ నిరసన
- శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం రాత్రి 8గంటల వరకు దీక్ష
- ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- హాజరు కానున్న పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల, జడ్పీ చైర్మన్ పుట్ట, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి, దాసరి

పెద్దపల్లి, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. పుష్కలమైన నీళ్లు, 24గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలతో సంబురంగా సాగింది. కానీ, కాంగ్రెస్ సర్కారు వంద రోజుల పాలనలో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా సాగునీటి గోస తీవ్రమవుతున్నది. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేలకు పైగా ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. చేతికి వచ్చే దశలో దెబ్బతిన్నాయి. మున్ముందు పరిస్థితులు మరింత దారుణంగా ఉండనున్నాయి. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదు. స్థానికంగా ఉండే పాలకులు కూడా కనీసం కన్నెత్తి చూడలేదు. ఇటు యంత్రాంగం కూడా క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మొన్నటి వరకు రైతులకు ఏ కష్టం రాకుండా చూసుకోగా.. ఇప్పుడు రైతులు పడుతున్న కష్టాన్ని చూసి బీఆర్ఎస్ నాయకులు చలించిపోతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భరోసానిస్తున్నారు. ఇటీవల మంథని, ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ధర్మారం, ఎలిగేడు, జూలపల్లి, పెద్దపల్లి మండలాల్లో దెబ్బతిన్న పొలాలను పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పరిశీలించారు. రైతులకు మేమున్నామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ఎండిన పంటలను సర్వే చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు ₹25వేల పరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదుకునేంత వరకూ వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలో 36గంటల రైతు నిరసన దీక్షకు పిలుపునిచ్చి, దీక్షకు అనుమతి కోసం ప్రభుత్వానికి విన్నవించారు. అయితే పోలీసులు దీక్షను బహిరంగ ప్రదేశాలు, ప్రధాన కూడళ్లలో కాకుండా పార్టీ జిల్లా కార్యాలయంలోనే చేసుకోవాలని అనుమతి ఇవ్వడంతో అక్కడే చేసేందుకు నిర్ణయించారు. నేటి ఉదయం 8 నుంచి ఆదివారం రాత్రి 8గంటల వరకు దీక్ష చేయనున్నారు. ఈ దీక్షలో పంటలు నష్టపోయిన రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా 14 మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు సైతం పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తోపాటు పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాట్లను మాజీ మంత్రి కొప్పుల, జడ్పీ చైర్మన్ మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి పరిశీలించారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, పార్టీ పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఇటు దీక్షను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. రామగుండం నియోజకవర్గంలోని రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

# వినోద్‌ను గెలిపించుకుందాం

- బీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, మార్చి 29 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే నాయకుడు బోయినపల్లి వినోద్ కుమార్ అని బీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి ప్రశంసించారు. మనమంతా కలిసికట్టుగా పనిచేసి వినోద్‌ను గెలుపించుకుందామని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన మళ్లీ గెలిస్తే ఢిల్లీలో ఏ ప్రభుత్వమున్నా కొట్లాడి నిధులు తెస్తారని, అభివృద్ధి చేస్తారని చెప్పారు. గంగాధర మండలం బూరుగుపల్లిలో చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ యూత్, విద్యార్థి విభాగం అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ వైపు యువత చూస్తున్నదని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నదన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం మోసపోయి బండి సంజయ్‌కి ఓటు వేస్తే నియోజకవర్గ అభివృద్ధికి నయాపైసా తేలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఆరు మోసాలని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ ద్యావ మధుసూదన్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు సుంకె అనిల్, నాయకులు రేగుల తిరుపతి, ఇరుగురాల రవి, లంక హరిబాబు, మామాడిపెల్లి అఖిల్, గుంటుకు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

# గనుల్లో రిటైర్ అయి.. మళ్లీ ఒక్కచోట కలిసి

- సింగరేణి రిటైర్డ్ కార్మికుల అ'పూర్వ' సమ్మేళనం



గోదావరిఖనిలో సమ్మేళనంలో కలుసుకొన్న విశ్రాంత ఉద్యోగులు

కోల్‌సిటీ, మార్చి 29 : వారంతా ఒకప్పుడు సింగరేణి కార్మికులు.. గోదావరిఖని ప్రాంతంలోని గనులపై దాదాపు 30 నుంచి 40 ఏండ్ల పాటు కలిసి పనిచేశారు.. రిటైర్ అయ్యాక చాలా మంది వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు.. భార్య, పిల్లలు, మనవలు, మనవరాళ్లతో సంతోషంగా గడుపుతున్నారు. కానీ, అందరిలో ఒక వెలితి! దశాబ్దాలపాటు కలిసి పనిచేసిన సహచర ఉద్యోగులంతా ఎక్కడెక్కడో ఉండగా.. అందరూ కలుసుకోవాలని అనుకున్నారు! అనుకున్నట్టుగానే 2014 వరకు రిటైరైన 50 మంది కార్మికులు శుక్రవారం గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీలోని ఒక ఫంక్షన్ హాల్‌లో కలుసుకొన్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. మళ్లీ ఇరువై, ముప్పై ఏండ్లు వెనక్కి వెళ్లి, అప్పటి అనుభవాలను పంచుకున్నారు. రోజంతా ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. మళ్లీ మళ్లీ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. భారంగా ఇండ్లకు వెనుదిరిగారు. రిటైర్డ్ ఉద్యోగి మేజిక్ హరి తన ఇంద్రజాల ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. పారుపెల్లి రాజలింగం, ఎండీ హుస్సేన్, మోహన్ రెడ్డి, రాజన్న, నర్సింగరావు, ఎరుకల రాజయ్య, కే సత్యనారాయణ, నాగేశ్వరరావు, రాజగోపాల్, జనార్ధన్, సత్తయ్య, మల్లేశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌కు రైతులంటే కోపం

- చిత్తశుద్ధి ఉంటే పంటలకు నీరందించు
- బీఆర్ఎస్‌పై విమర్శలు మాని ప్రజా సంక్షేమంపై దృష్టిసారించు
- ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భానుప్రసాదరావు

పెద్దపల్లి, మార్చి 29: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులంటే కోపం. అందుకే ఎన్నికల ముందు ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి మోసం చేసిండు. ఇప్పుడు సాగుకు నీరందించకుండా ఇబ్బందిపెడుతున్నడు. నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే పంటలకు నీరందించాలని' ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు డిమాడ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి రోజంతా బీఆర్ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, ఇప్పటికైనా ప్రజాసంక్షేమంపై దృష్టిసారించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని, పాలనలోనూ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు సాగు, తాగు నీటికి అల్లాడుతుంటే నివారణ చర్యలు చేపట్టడంలోనూ సర్కారు విఫలమైందని మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే స్థితిలో ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతుంటే ఆదుకునేది పక్కన బెట్టి ఇతర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువయ్యారని, అందుకే బీఆర్ఎస్ నేతలను చేర్చుకొని టికెట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టేందుకు ఇంకా ప్రయత్నిస్తున్నారని, ఆయన్ను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కొంతమంది పార్టీ నుంచి వెళ్లిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ బలహీన పడదని, రాబోయే కాలంలో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు పెద్దపల్లిలో చేపట్టనున్న రైతు నిరసన దీక్షకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీవైస్ చైర్మన్ మండిగ రేణుక రాజనర్సు, కాల్వశ్రీరాంపూర్ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సదానందం, పడాల సతీశ్ గౌడ్, పడాల స్వామి గౌడ్, నాగేశ్వరరావు ప్రసాద్‌రావు, రాజు ఉన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు పితృవియోగం

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం



ఎమ్మెల్యే తండ్రి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల/ జగిత్యాల కలెక్టరేట్, మార్చి 29: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ తండ్రి, సీనియర్ న్యాయవాది హనుమంతరావు (85) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం జగిత్యాల హౌసింగ్ బోర్డుకాలనీలోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన ఉమ్మడి జిల్లాలో సీనియర్ న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. తన సేవలతో మంచి గుర్తింపు పొందారు. ఆయనకు ఇద్దరు కొడుకులు సంజయ్, సందీప్‌కుమార్, కూతురు రజిత ఉన్నారు. రాత్రి ఎనిమిది గంటల తర్వాత మోతె శ్మశానవాటిక (శంకర్‌ఘాట్)లో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు హనుమంతరావు భౌతిక కాయానికి పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. సంజయ్‌ను జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు, వేదపండితులు నంబివేణుగోపాలచార్య కౌశిక, తిగుళ్ల విష్ణు శర్మ, పురప్రముఖులు పరామర్శించారు. రాత్రి 8గంటల ప్రాంతంలో భౌతికకాయం వద్ద బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నివాళులర్పించారు. ఇటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. హనుమంతరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, సంతాపాన్ని ప్రకటించారు.



హన్మంతరావు (ఫైల్)

### అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం

హనుమంతరావు మృతికి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం విచారకరమని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రూ.లక్ష సీజ్

వేములవాడ రూరల్, మార్చి 29: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో వేములవాడకు చెందిన అబ్దుల్ రహీమ్ వద్ద రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేయగా, ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును సీజ్ చేశామని, ఎన్నికల అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పాల్గొన్నారు.

# ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలి

తెలంగాణచౌక్, మార్చి 29: ఈ శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తూ చనిపోయిన, శాశ్వత అంగవైకల్యం పొందిన అసంఘటిత రంగ కార్మికుల కుటుంబీకులు ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా ఉప కార్మిక శాఖ కమిషనర్ శ్యాముల్‌జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం సురక్ష బీమాయోజన కింద 2021 ఆగస్టు 26 నుంచి 2022 మార్చి 31 మధ్య ఈ శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకొని ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.2లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందిన అసంఘటిత కార్మికులకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా నామినీలకు అందిస్తుందని చెప్పారు. అర్హులు నేటి సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.